కథానిక

# విశాల హృదయుడు

పెనుమర్తి కామేశ్వరరావు

'ఆమె ఏడిస్తే నాకెందుకు, నవ్వితే నాకెందుకు, నిట్టూరిస్తే నాకెందుకు? ఆమె భర్త కొడితే ఏడుస్తోందో, లేక భర్త నల్లరిపెట్టడానికే ఏడుస్తోందో నాకెందుకు? ఆమె కష్టసుఖాలతో నాకు పనేమిటి? ఆమెతో పరిచయం లేని నేనామెను ఓదారుద్దామని భావించి 'తాయారమ్మగారూ? ఎందుకు పాపం! అలా ఏడుస్తున్నారు?' అని నే నడిగితే, తనకంటే పదిహేనేళ్లు చిన్నవాణ్ణి నన్ను దబాయించింది! నీ పరామర్శలేవీ నాకక్కర లేదంది! అంతతో వూరుకుందా? 'నీవు నన్నెన్నిసార్లో ఎగాదిగా చూడటం నే గమనించలే దనుకున్నావా? నలభై ఏళ్లు నిండిన దానిమీదనా, నీ ప్రేమ చూపులు! జాగ్రత్త' అని కోప్పడింది. నాకెందుకు ఆమెగురించి! ఏదో నెలకాగానే గది అద్దె పది రూపాయలు శివానందంగారి చేతిలో పెట్టివస్తే పోతుంది' అనుకున్నాడు నారాయణ తన గదిలో తనమదిలో.

సంధ్యా సమయమప్పుడు చక్కగా సింగారించుకుని ఆమె వీధి వాకిట్లో నిలబడి దారిని పోయే మగవారి నెంతో శ్రద్ధతో పరీక్షగా పరికిస్తుంది. కాని-మూడు మాసాలనుంచి ఏక గృహంలో వుంటున్న తనని ఆమె ఒక్కసారైనా ఆప్యాయంగా తిలకించిందా? లేదు. తనని చూచి పైగా కొరకొర చూపులు! నిజంగా తను బజారున నడిచిపోయే బాటసారుల పాటి చేయలేనా? ఆమెకంటే తను వయసులో పదిహేనేళ్లు చిన్న. అంటే తనకు పాతిక సంవత్సరాల వయస్సు. అవయవ సౌష్టవంలో, అందంలో, చందంలో తను అనాకారేం కాదు. మరెందుచేత తనమీద ఆమె కంత కోపం?

ఆమె వూసే మరచిపోదామనుకున్న నారాయణకు యువకుడైన నారాయణకు, ఆమె తనని కించపరిచే ప్రయత్నంలో లీనమైనట్లుగా తోచింది. ఆమెకు తానేం అపకారం చేశాడు? తన యెరుకతో, తానీ జన్మంలో ఆమె కేమీ అపకారం చేయలేదు. పూర్వ జన్మలో ఆమె తన భార్యేమో? తానామెను నానా హింసలూ పెట్టాడేమో పూర్వజన్మంలో? కాకపోతే తనకేమిటి లోపం? తన నామె- అప్సరసగా జన్మించి జరరుజ లెరుగక యెల్లప్పుడూ నిత్యనూతన వయోవిలాస మధుమూర్తి-నిరాదరంతో, నీరసుడుగా భావించడం తన పురుషత్వానికి తీరని అవమానం! తానీ విషయాన్ని సామాన్య విషయంగా భావించడం భావ్యం కాదనిపించిందతనికి! కాని, తానేంచేస్తే ఆమె తనని అనురాగంతో చూస్తుంది- ఆదరంతో పలకరించి మాట్లాడుతుంది? కూరలవాడితో యెంతసేపయినా శ్రద్ధగా మాట్లాడుతుంది. చాకలివాడితో యెంతో యిదిగా సంభాషిస్తుంది! తను వాళ్ళకంటే హీనుడా? తానింత అవమానాన్ని భరిస్తూ, ఆమె యింట్లో ఓ గదిలో అద్దెకుండటం- అసలు తానా యింట్లో గది సంపాదించడానికి భగీరథ యత్నం చేశాడు. శివానందంగారికి సన్నిహితులైన మిత్రులచేత తన మంచితనాన్ని చెప్పించకుండా ఆ గదిలో చేరగలిగాడు. తనా గదిలో చేరడంలో మొదట్లో దురద్దేశ్యం లేకపోయినా ఆమె అందరితో చనువుతో మాట్లాడుతూ తనని అంటరాని వాడుగా భావించడం నారాయణకు దుస్సహమైనది. కాని ఏం చేస్తాడు? గది మార్చుకుందామంటే చీటికీమాటికీ గది దొరకడంలేదు. అసలా వూళ్ళో ఒంటరిగా జీవించే మగాళ్లందరూ తుంటరివాళ్లని ఓ కంటగింపుందని నారాయణ ఆ గ్రామంలో ఉద్యోగరీత్యా అడుగుపెట్టిన కొన్ని గంటలకే తెలుసుకున్నాడు. మొదట్లో పోస్టాఫీసుకు రెండు మైళ్ళ దూరంలో ఓ గదిలో ప్రవేశించాడు. కాని ఆఫీసుకా గది దూరంగా వుండడం,

హోటలు అందుబాటులో లేకపోవడం, అదే ఆవరణలో ఆరు కుటుంబాలు కాపురముండటంవల్ల ఆ గదిమారుద్దామని, ఆగదిలో చేరిన వారంరోజులకే అతనికుద్దేశ్యం కలిగింది. మూడు మాసాలు గాలించాడు పోస్టాఫీసుకి సమీపంలో ఒక గది కోసం. కాని అతన్ని ఎగాదిగా చూచి అతని మంచితనానికి విలువకట్టి, అద్దెకీయడానికి తమ గృహంలో ఓగది కాళీగావున్నా "మాఇంట్లో కాళీలేదు" అన్నారు ప్రతి యింటివాళ్లు.

ఆ గ్రామానికి తాను నూతనుడని నిరుత్సాహపడి, నారాయణ తన ప్రయత్నాన్ని విరమించలేదు. గ్రామంలో అందరికీ పోస్టాఫీసుతో అవసరముంటుంది. పోస్టాఫీసుకి సమీపంలో ఉత్తరాలందించే పోస్టుమన్ చేతిలో ఓరూపాయి పెట్టి, అతనికి విన్నవించుకున్నాడు తన యిబ్బందినంతా నారాయణ. ఆ పోస్టుమన్ ఆ రూపాయి తీసుకొని అమిత విశ్వాసంతో, ఆ పేటలో ఉత్తరాల బట్వాడాకు వెళ్ళినపుడు ఉత్తరాలిచ్చి ప్రతి గృహ యజమానినీ అభ్యర్థించాడు. "పంతులుగారూ! మీ యింట్లో ఓగది అద్దెకిస్తారా" అని. పోస్టుమన్‌తో మంచిగావుంటే యెప్పటి వుత్తరాలప్పుడే యిస్తాడన్న ఆశతో "ఎవరికోయ్ గది?" అన్నాడు శివానందం ఆ పోస్టుమన్ తనని ప్రశ్నించినప్పుడు.

మా ఆఫీసులో గుమాస్తాగారికండీ! ఆయన చాలా మంచివాడు. పాతిక సంవత్సరాలుంటాయి. అయినిప్పుడు ఆఫీసుకి రెండు మైళ్ళ దూరంలో నుంటున్నాడు పాపం! ప్రతి దినం అంతదూరంనుంచీ రావడమంటే చాలా కష్టంగావుంది" అన్నాడు పోస్టుమన్.

"ఈగది కాళీగానేఉంది: కాని అతనెటువంటివాడో విచారించకుండా నే నీయలేను. అతని ప్రవర్తనగురించి తెలుసుకుంటాను. రెండు రోజుల్లో చెబుతాను." అన్నాడు. శివానందం షావుకారు గుమాస్తాగా పది సంవత్సరాలనుంచీ విశ్వాసంతో పని చేస్తున్నాడు. షావుకారు ప్రతి సంవత్సరం వ్యాపారంమీద పాతికవేల రూపాయలు సంపాదిస్తూ గుమాస్తా శివానందానికి సంవత్సరానికి ఐదురూపాయిలు జీతం పెంచడంవల్ల, నెలకు పదిహేనురూపాయల జీతం వలనైనది రూపాయిలయింది ఇన్ని సంవత్సరాలకు. ప్రతి సంవత్సరం షావుకారు భార్య కేనో క్రొత్తనగలు చేయిస్తున్నాడు, కొత్త పట్టు చీరెలు కొంటున్నాడు. వ్యాపారాభివృద్ధి కోసం, వత్సరానికోసారి షావుకారు భార్యా సమేతుడై సత్యనారాయణవ్రతం చేసినప్పుడతని భార్యకత డాయేడు వచ్చిన లాభంలోనుంచి చేయించిన కొత్త నగలు, శివానందం చూచి, సంతోషించేవాడు. షావుకారు భార్య నల్లగా వుంటుంది. అన్నినగలు పెట్టుకున్నా, అందమైన బెంగుళూరు సిల్కుచీరె కట్టుకున్నా అటువంటినగలు, అటువంటి చీరెలు తన భార్య తాయారమ్మ ధరిస్తే, ఎంతసౌందర్యవతిగా నుంటుందో శివానంద మూహించుకునేవాడు. తనూ, ఇంకో ఇతర గుమాస్తాల సహాయంవల్ల, తన యజమాని అంత ధనాన్ని ప్రతి సంవత్సరం సంపాదిస్తున్నాడనీ, ఆ లాభాలలో తమకేమీ భాగం పెట్టకపోగా కనీసం బోనసుగానైనా సంవత్సరానికి ఓవంద రూపాయలైనా ఈయక, సత్యనారాయణ వ్రతసందర్భమున గుమాస్తాలందరికీ 20వ నంబరు ముతకధోవతుల చాపులిచ్చి సంతోష పడమంటున్నాడని శివానందానికి విచారంలేదు. తన యజమాని పూర్వపుణ్యవశాన లక్ష్మీ పుత్రుడుగా జన్మించాడు. ఏమీ పెద్ద చదువు చదవలేదు. పంగనామాలు పెట్టుకుని ఇస్త్రీ బట్టలు ధరించి, పట్టంచు వుత్తరీయం మడత విప్పకుండా నెలల తరబడి వేసుకుంటూ, గుమాస్తాల సహాయంతో లెక్కలు తయారుచేస్తూ, వ్యాపారం చేస్తున్నాడు షావుకారు. తను పంగనామాలు పెట్టుకున్నా ఫరవాలేదు కాని, అతు లార్జించడానికి లోకులకు పంగనామాలు పెట్టగల సామర్థ్యం ఆయనకు లేకపోలేదు. శివానందం ఆయనవద్ద గుమాస్తాగా చేరకముందు రెండు సార్లు దివాలా తీసిన షావుకారు నేడు రెండంతస్తుల మేడలో, విద్యుద్దీపాల కాంతిలో, రేడియో గానంలో ఘరానాగా జీవిస్తున్నాడు.

శివానందం ఉదయం ఎనిమిదిగంటలకు తన చింకిరి పాతగొడుగు వేసికొని పనిలోకి వెళ్ళి మధ్యాహ్నం 12 గంటల కింటికి వస్తాడు. మళ్ళీ రెండుగంటలకు వెళ్ళి రాత్రి ఎనిమిదిగంటల

కింటికివస్తాడు. అన్నివస్తువులకు ధరలు పెరిగిన కాలంలో, శివానందం నలభైఐదు రూపాయల జీతంతో ఎలా సుఖంగా జీవిస్తున్నాడని గానీ, బస్తీలో స్వగృహంయెలా సంపాదించాడని గానీ ఎవరూ ప్రశ్నించనవసరంలేదు. తాయారమ్మకు తల్లి ఆస్తి తాలూకు రెండెకరాల మాగాణి పొలముంది. వర్షాలు బాగా కురిస్తేనే ఆ పొలంలో ఎక్కువగా ఆదాయం లభించేది. తాయారమ్మ పొలంమీద వస్తున్న ఆదాయమంతా బ్యాంకులో నిల్వ చేసింది, బంగారం చవకయితే రకరకాల నగలూ చేయించుకుందామని- కాని బంగారం ధర నానాటికీ పెరిగిపోవడం వల్లా, బాంకులో నూటికి సంవత్సరానికి రెండున్నర రూపాయల వడ్డీమాత్రమే వస్తుండడంవల్లా, అద్దె కొంపల్లో ఎన్నో ఇబ్బందులు పడిపడి, ఆ డబ్బుతో ఒక చిన్న డాబా కొనుక్కున్నది. ఆ డాబాలో తాము కాపురం వుండటమే కాక, ఓ ప్లీడరు గుమాస్తాకు రెండు గదులు పదిహేను రూపాయల కద్దెకిచ్చింది. ఆ రెండు గదులు పోను, దక్షిణ వైపున తాముంటున్న భాగం మూడు గదులు, ఒక వంటయిల్లు కావడంవల్ల మొదటి గది, చదువుకునే కుర్రాళ్ళకు, ఇతరులకు ఎనిమిది రూపాయల అద్దెకివ్వడం అలవాటు.

ఒక సంవత్సరం ఆ గదిలో స్కూలు పిల్లలు చేరి చాలా అల్లరీ చేశారు. దొడ్లోవున్న రెండు కొబ్బరిచెట్ల కాయలూ కోసుకుని నీళ్లు త్రాగి కొబ్బరి తిన్నారు, శివానందం, భార్య ముగ్గురు పిల్లలు ఏదో వూరు పెళ్ళికి వెళ్ళి వచ్చేసరికి. తదాది గది అద్దెకీయడం మానేశారు. మాని వేయడంవల్ల ఆదాయం తగ్గిపోయిందన్న దిగులు శివానందానికంటే తాయారమ్మకధిక మైంది. మునిసిపాలిటీ ఇళ్ళ పన్నులు పెంచేసింది. ప్రతి దినం తాయారమ్మ భర్తతో చెప్పేది: "ఆ గదిలోకి అద్దెకెవరైనా వస్తారేమో విచారించారా? ఎనిమిది కాకపోతే, నెలకు ఏడు రూపాయలిచ్చినా మనకు నష్టంలేదు. కాళీగా వున్నదానికంటే నయంకాదూ!" భార్య మాటలు విని శివానందం, "నాకు తీరిక ఎక్కడ ఏడ్చింది. నీవే విచారించుకోకూడదూ? నీ యిల్లు కాబట్టి ఈయింటిగూర్చి నీదే పెత్తనం." అంటాడు.

* * *

పోస్టుమన్ వచ్చి గది అద్దె కావాలన్నాడని శివానందం తాయారమ్మకు చెప్పాడు. తాయారమ్మ సంతోషంతో,

"గదిలో వెంటనే చేరమన్లేనూ?" అన్నది.

"పోస్టాఫీసులో గుమాస్తాట! పాతిక సంవత్సరాలుంటాయట. ఇప్పుడాఫీసుకు రెండుమైళ్ళ దూరంలో వుంటున్నాడట! అతనెటువంటివాడో విచారించి తరవాత చెపుతానన్నా జవానుతో" అన్నాడు శివానందం.

"పోస్టాఫీసు గుమస్తా గురించి విచారించేదేమిటి? అటువంటివాడు మన యింట్లో వుంటే మనకి కార్డులకు కవరకు ఇబ్బంది వుండదు. అద్దె పదిరూపాయలని చెప్పండి. మునిసిపాలిటీ పన్ను పెరిగింది. గవర్నమెంటు ఉద్యోగికి కూడ స్కూలు పిల్లల కిచ్చినట్లుగా ఎనిమిది రూపాయల కివ్వడానికి వీలుకాదు!" అన్నది తాయారమ్మ.

"ఏడు రూపాయలకే యిస్తానన్నావుగా నిన్నటిదాకా? ఎనిమిదని చెబుతాను" అన్నాడు శివానందం.

"అద్దె పదికి తగ్గించను. ఈ యిల్లు నాది. తగ్గించడానికైనా పెంచడానికైనా నాయిష్టం గాని, మీదేంలేదు! సాయంత్రం వచ్చి చేరుతాడా?" అన్నది తాయారమ్మ.

"ఓసి నీ తొందర పాడుగాను! అర్నెల్లబట్టి గది కాళీగా వుంటే ఏం చేశాం? ఏ విషయమూ రెండు రోజుల తరవాత చెబుతానన్నాను!" అన్నాడు శివానందం.

"మీ తెలివి తెల్లవారినట్లే వుంది! మధ్య రెండురోజుల అద్దె మనం యెందుకు పోగొట్టుకోవాలి? నెలకు పది రూపాయల అద్దె అయితే రోజుకి 0-5-4 పడింది. రోజూ కూరకేనా వస్తుంది! మీరు రెండింటికి పనిలోకి వెళ్ళేటప్పుడు, అలా పోస్టాఫీసుకి వెళ్ళి- పాపం! ఆ అబ్బాయి ఆఫీసు దూరం కావడంవల్ల ప్రతి రోజూ ఎంత యిబ్బంది పడుతున్నాడో- వెంటనే చెప్పండి! ఏమని చెబుతారు? 'నెలకి పది రూపాయలద్దె - మీకిష్టంగావుంటే ఇవాళనే గదిలో చేరవచ్చు!' అని చెప్పండి. గవర్నమెంటు ఉద్యోగి గురించి విచారించనవసరం లేదు. అతను వయసుకి కుర్రవాడైనా చాలా

పెద్దమనిషై వుంటాడు' అన్నది తాయారమ్మ, వ్యవహారజ్ఞానంతో, ధనాశతో.

ఆ మాటలు విని శివానందం జవాబు చెప్పడానికి మాటలు నోటివెంట పెగలక, భార్యనొకసారి వింతగా చూచి, చొక్కా తొడుక్కున్నాడు. ఆఫీసువైపు వెళ్ళి, తమ పేట పోస్టుమన్‌ని కలుసుకుని, గుమాస్తా పేరు తెలుసుకుని, అతనితో తమ గది విషయం చెబుదామని. ఋష్యశృంగుడి శిరస్సుమీద కొమ్ము వుంటుందని పురాణాలలో వ్రాసియుంటే, నేటి నాస్తికులు, పురాణ వ్యతిరేకులు, మానవ శరీర శాస్త్రజ్ఞులు నమ్మలేకపోయారు! శివానందానికి పొట్టమీద ఋష్యశృంగుడికి తలమీద మొలిచిన కొమ్ములాంటిది ఉంది! ఋష్యశృంగుడు పాదంపెట్టిన భూమి సస్యశ్యామలమైనట్లు రామాయణంలో వుంది. అలాగే శివానందం షావుకారువద్ద గుమాస్తాగా చేసిన సంవత్సరం షావుకారు ఇనప్పెట్టెలో ధనవర్షం కురిసింది!

పోస్టుమేన్ రెండింటికి పోస్టాఫీసుకి రాలేదని తెలుసుకుని, గుమాస్తాలందరినీ పరకాయించి చూచి, అందరిలో చిన్నవాడుగా కనిపిస్తున్న నారాయణవద్దకే వెళ్ళి 'మీరేనా- గది కావాలి అద్దెకని పోస్టుమేన్‌తో చెప్పింది?' అని ప్రశ్నించాడు శివానందం.

నారాయణ సంతోషంతో కుర్చీలో నుంచి లేచినిల్చొని "అవునండీ! మీ యిల్లు ఆఫీసుకి సమీపంలో ఉందా? డాబాయా, లేక పెంకుటిల్లా? దొడ్లో బావి వుందా?" అని ప్రశ్నించాడు.

"అన్ని వసతులూ ఉన్నాయి. డాబాలో దక్షిణావైపు గది. నెలకద్దె పది రూపాయలు. సాయంత్రం మీరాఫీసునుంచి వెళ్ళేటప్పుడు మాయింటికి వెళ్ళి గది చూచుకుని, మీకిష్టంగా వుంటే రేపే చేరవచ్చు!" అని చెప్పి, అప్పటికే రెండు గంటలు దాటడం వలన, షావుకారు కొట్టుకువెళ్ళాడు. నారాయణకు తరవాత పోస్టుమాన్ కూడా చెప్పాడు- ఆ గది గురించి. ఆ సాయంత్రమే నారాయణ, పోస్టుమాన్ ఇద్దరూ గది చూదామని వెళ్ళిన సమయాన, తాయారమ్మ వీధివాకిలిలో నిలబడి వుంది. నారాయణ పాంటు, పాప్యలేన్ షర్టు పాదాలకు బెల్టు బూటు ధరించి సిగరెట్టు కాలుస్తున్నాడు.

"మీయింట్లో అద్దెకిచ్చే గది వుందనీ, దానికి పది రూపాయలద్దెనీ, వెంటనే గదిలో ప్రవేశించడానికేమీ అభ్యంతరంలేదనీ మధ్యాహ్నం రెండు గంటలకు పోస్టాఫీసుకి వచ్చి, శివానందంగారు చెప్పారు. గది చూదామని వచ్చాం." అన్నాడు నారాయణ తాయారమ్మతో.

"గదిలో ఎందరుంటారు? మీరొక్కరేనా...?" అన్నదామె. తాయారమ్మ ఇంట్లోకి వెళ్ళి గదిలోపల తలుపుల గడియ తీసింది. నారాయణ గదిలోనికి వెళ్ళి, రెండు అలమరలు మూడు కిటికీలు సందువైపుకు కూడా ఒక తలుపు వుండడం చూచి తృప్తిపడి, "మీయింట్లో గంటల పంచాంగముంటే ఒకసారి యిప్పించండి. మంచి రోజెప్పుడో చూచి, గదిలో యెప్పుడు ప్రవేశించేదీ యిప్పుడే చెబుతాను." అన్నాడు. సంతోషపడి తాయారమ్మ వెంటనే గోడకు తగిలించబడి వున్న కాలెండరు తెచ్చి నారాయణకిచ్చింది.

"రేపు సప్తమీ బుధవారం! రేపు బాగానే వుంది, గదిలో ప్రవేశించడానికి. రేపు పదిగంటలకు నా సామానుతో వస్తాను. కాస్త గది శుభ్రంగా కడిగించివుంచండి" అన్నాడు నారాయణ.

"ఎవరి చేత కడిగించడం? నేనే కడుగుతాను. రేపు తప్పక వచ్చిచేరతారుగా? చాలామంది తిరిగిపోతున్నారు, మాకంటే మాకంటూ. కాస్త మంచివారు, ఉద్యోగంలోనున్న వారెవరైనా లభిస్తే, గది అటువంటివారికిద్దామని, ఎవరు వస్తామన్నా 'మా గది అద్దెకివ్వం' అని సమాధానం చెప్పాం" అన్నది తాయారమ్మ.

నారాయణ ఆమెని సావధానంగా తిలకిస్తూ నిలబడ్డాడు సమాధానాన్ని ఆలోచిస్తూ: అయిదడుగుల ఎత్తయినా లేని అతను పాతికేళ్ళ వయసువాడని నమ్మడం కష్టం ఎవరికైనా. పైగా బక్కపలచగా ఉంటాడు. కోలముఖం, చిన్న కళ్లు, పెద్ద గద్ద ముక్కు. కాని శరీరఛాయ పసుపురంగు కావడంతో, అతని ముఖం అంత వికృతంగా కన్పించదు! తాయారమ్మను వర్ణించడం మాని, ఆమె రంభ, ఊర్వశి, మేనక,

తిలోత్తమ కోవలోనిదంటే సరిపోతుంది. ఆజానుబాహు విగ్రహానికి తగిన పుష్టికలిగి, నవ్వినప్పుడు బుగ్గలు సొట్టలు పడుతుంటాయి. ఆమె కంటికి ప్రతి పురుషుడూ చాలా నీరసంగా కన్పించడం సహజమనక తప్పదు. పుట్టింటి వారామెని అనాలోచితంగా, శివానందం దగ్గర బంధువని అతనికిచ్చి పెళ్లి చేశారు. కాని, నిజంగా ఆమె ఏ ధనవంతుడికో, ఏ పెద్ద ఆఫీసరుకో భార్యయై కారుల్లో, బజారుల్లో, షికారు పోవలసిన రూపురేఖా విలాస లావణ్యములు కలది. ఆమె చిన్నతనంలో, అందానికి నేడేర్పడిన విలువ వుండివుండదు! అదీగాక, ఆనాడు స్త్రీలకు విద్యలేదు. పైగా పిల్లలకు అతి బాల్య వివాహాలు కావడం వల్ల, ఆ కాలంలో ఇన్ని సినిమాలు, ఇన్ని సెక్సు, సినిమా పత్రికలు లేనందున, రజస్వలానంతర వివాహాలు కానందున, ఆడపిల్ల లాకాలంలో తమ భర్తల్ని సినిమా నటులుగా వుండాలని భావించే అవకాశం లేదు. తల్లి దండ్రులే తమ కుమార్తెలకు భర్తల్ని విచారించి, వారి అనుమతి లేకుండా పెళ్లిళ్లు చేసేవారు. ఆనాడు సమాజంలో స్త్రీ పురుషులకు నేటి ఆలోచనలు, తెలివి తేటలు లేక అంతా దైవం మీద భారం వేసేవారు! తాయారమ్మ శివానందం దంపతులు ఆనాటి వారైనా, శివానందం నాటికీ నేటికీ మార్పులేకుండా వుంటుంటే, నలభై వత్సరాల తాయారమ్మ కాలం తెచ్చిన మార్పులను గ్రహించి, తనకున్న తాహతులు అధునాతనంగా సింగారించుకొనడం వల్ల, ఆమె ముప్ఫయి వత్సరాల మనిషని నారాయణవంటి యువకులు పొరబడడం కలదు! ఆమె దేవతా సౌందర్యాన్ని చూచిం తర్వాత, నారాయణ మనసులో శివానందం రూపం కన్పించింది. శివానందం భార్యకంటే లావుగా నుంటాడు. వారసమాన దంపతులు కావడంవల్ల, తాయారమ్మ భర్తతో ఎక్కడికైనా పోవాలంటే ఎంతో మానసిక వేదన పడేది. ఆయనతో పోవడం ఆమె కిష్టంలేదు. ఆర్థిక దుస్థితివల్ల పెళ్ళిళ్ళకు, గర్భాధానాలకు తాయారమ్మ ఒక్కతే వెళ్ళేది. శివానందానికి పనిలో సెలవు లభించేది కాదు.

తాయారమ్మ కిద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. కూతుళ్ళిద్దరి తరవాత కుమారుడు కలికలిగాడు. పెద్దకూతురుకు పదిహేనేళ్లు, రెండో కూతురుకు ఎనిమిదేళ్లు, కుమారుడికి అయిదేళ్లు.

నారాయణతో తాయారమ్మ మాట్లాడుతుండగా పెద్ద కూతురు రంగమ్మ వచ్చి తల్లి ప్రక్కన నిలబడడం నారాయణ కుత్సాహాన్ని కలిగించింది.

"తప్పకుండా రేపు పది గంటలకు వచ్చి గదిలో చేరతాను. అడ్వాన్సుగా యీ అయిదు రూపాయలు తీసుకోండి" అని నారాయణ పాంటు జేబులోనుంచి పర్సుతీసి, అయిదు రూపాయిల కాగితం తాయారమ్మ కిచ్చాడు. అది నుంచి దవునో కాదో, ఓ నిమిషం పరీక్షించి కూతురితో ఇంట్లోకి వెళ్ళింది. రంగమ్మ లోపలనుంచివీధి వైపే చూస్తున్నది ఆశ్చర్యంతో, గదిలో చేరక మునుపే నిర్లక్ష్యంగా అయిదు రూపాయలు అడ్వాన్సిచ్చిన నారాయణగురించి.

* * *

ఉదయం తాయారమ్మ గదంతా శుభ్రంగా చిమ్మి, దుమ్మంతా దులిపి, నీళ్ళతో ఒకటికి రెండుసార్లు కడిగింది. రంగమ్మ గదిలో తను నేర్చుకున్న ముగ్గులు పెట్టింది. ఆమె రజస్వలయి రెండు సంవత్సరాలయింది. కూతురు రజస్వల కాకముందు నుంచీ, తల్లిదండ్రు లామెకు వరుణ్ణి వెదకుతున్నారు. శివానందానికి పూర్వాచార పద్ధతిగా కూతురికి భర్త నొకణ్ణి తానే నిర్ణయించి, పెళ్ళి చేయాలని కోరికవుండేది. తాయారమ్మ తన కూతురిని చదువు, ఆస్తి, చక్కదనం, ఉద్యోగం ఉన్న వాడికిచ్చి పెళ్ళిచేయాలని ఆశించింది. తన దురదృష్టంవల్ల, తాను శివానందానికి భార్య అయింది కాని, తన కూతురికి ఎలాగైనా మంచి భర్తని సంపాదించాలని, తమ శాఖలో బంధుకోటినంతా తిరగేసింది. రెండు సంవత్సరాలనుంచీ, పెళ్ళి కొడుకుల్ని విచారించడానికి శివానందం వెళ్ళినప్పుడల్లా, అతని చూచినవాళ్ళు, కూతురు కూడా అతనివలెనే వుండివుంటుందని, రంగమ్మ చక్కదనం చూడకుండానే నిర్ణయించి కొందరు విముఖత్వాన్ని ప్రకటించారు. మరికొందరు పది వేల రూపాయల కట్నానికి తగ్గలేదు. కొందరు

అనవసరంగా తాయారమ్మ పాతివ్రత్యాన్ని శంకించ నిశ్చయించుకున్నారు. భర్త అమాయకుడు కావడంవల్ల ఆమె ఇంటి పెత్తనం వహించి, ఆర్థిక దుస్థితి పాల్పడకుండా, సంసారాన్ని ఈదుతుండడం చూచి, కొంద రామె అసాధ్యురాలని అనుకున్నారు.

రంగమ్మకు పెళ్ళికూతురి కుండవలసిన లక్షణాలన్నీ వున్నాయి. అయిదో తరగతివరకు చదువుకుంది. తెలుగు, హిందీ సినిమాల పాటలు శ్రావ్యంగా పాడుతుంది. స్వతంత్రంగా వంట చేస్తుంది, తల్లి బైటచేరినప్పుడు. ఇంట్లో పాచి పనంతా చేసి, రెండు పూటలూ అంట్లు చెంబులు తోముతుంది. తల్లికి ఎల్లప్పుడూ చేదోడుగా ఉంటుంది. ఈ దేశంలో అనాకారిగావున్న వాళ్ళనేగాక, అందంగా వున్నవాళ్ళని కూడా విమర్శించడ మలవాటుకాబోలు! నిక్షేపంవంటి తాయారమ్మ కూతురి చక్కదనం, ధనవంతుల మేడల్లో రాణించవలసిన యోగ్యతకలది. కూతురికి వివాహం కాలేదని శివానందం కంటే తాయారమ్మ మానసికంగా బాధపడేది. తల్లి ప్రాణం తల్లడిల్లినంతగా తండ్రి ప్రాణం తల్లడిల్లదు.

“నీ గొంతెమ్మ కోరికలవల్లనే రంగ కింత వరకూ సంబంధం కుదరలేదు. ఎవర్ని కదిలించినా, పదివేలు కట్నం, కనీసం మూడు రోజులు పెళ్ళి, ఆడబిడ్డలకు ప్రత్యేక లాంఛనాలు అడగడం! నీ రెండెకరాలు అమ్మితే, పదివేల రూపాయలు రావు. ఎనిమిది వేలు వస్తాయి ఇప్పటి అధిక ధరలలో. ప్రతి సంవత్సరం నీ పొలంవల్ల, తిండికిబ్బందిలేకుండా జరిగిపోతున్నది, అందులో వస్తున్న ధాన్యంతో. ఎగరలేని గంతులు వేయాలంటే, ఎలా సాధ్యమౌతుంది. పూర్వం ఆడపిల్లల పెళ్ళిళ్ళ కింత ఆలోచన ఉండేదికాదు. నాకు ముప్ఫయి వత్సరాలప్పుడు పెళ్ళయింది. నీ కప్పుడు పన్నెండేళ్లు. మనిద్దరికీ మధ్య పద్దెనిమిదేళ్ళ వ్యత్యాసముంది. ఏం వుంటే మనకేం లోపముయుంది?”

“మనకేమీ లోపంలేదు! మనిద్దరం రతీమన్మధుల వలె కనిపిస్తున్నాం నలుగురికీ! మీ మూలకంగానే అమ్మాయి కెక్కడా తగు సంబంధం కుదరటం లేదు. మీ చింకిరి గొడుగు, చింకిరి చొక్కా, ముగ్గు బుట్టల వంటి తల, మీ వృద్ధాప్యం చూస్తే, ఎంత తెలివితక్కువ వాడైనా ఇట్టే పసికడతాడు-మీరు దరిద్రదేవత స్వరూపమని! మిమ్మల్ని తప్ప నే నింకెవర్ని పంపేది, వరాన్వేషణ కోసం? మా నాన్న లేడు. మా తమ్ముడున్నాడంటే ఎక్కడో దూర దేశంలో బొంబాయిలో వుంటున్నాడు! నే నెలా చచ్చేది. ఈ సమస్య తీరేదియెట్లా? నా వలెనే మంచి పుట్టక అమ్మాయి. రజస్వల అయింది మొదలు, రోజుకో తీరుగా చక్కగా ఎదుగుతున్నది. వయస్సువచ్చిన పిల్లకి పెళ్ళిచేయకుండా ఆపడం సాధ్యంకాదు. మీకు పనిలో తీరికలేదని నేను వారినీ వీరినీ పెళ్ళికొడుకుల గురించి వాకబుచేస్తూనే వున్నాను.” అన్నది తాయారమ్మ.

“ఫలానా వూరిలో, ఫలానా సంబంధం ఉంది అని నీవుచెప్పినప్పుడల్లా, మా షావుకారు కొప్పడినా శలవు పెట్టి వెళ్ళి విచారించి వచ్చాను. నే చెప్పేది విను: అమ్మాయి పెళ్ళిఘడియ ఇంకారాలేదు. దైవకృపవుంటే, మనం ఇంత శ్రమపడకుండానే దానివివాహ మీపాటియి, భర్తతో కాపురం చేస్తుండేది.” అన్నాడు శివానందం.

“చివరకు మనకు వేదాంతం, దైవమేగతి!” అన్నది తాయారమ్మ విసుగుదలతో.

కూతురి వివాహం గూర్చి ప్రతిమాసంలో పౌర్ణమినాటి వెన్నెలలో చర్చ ప్రారంభమై అది అమావాస్యవరకు నిరంతరాయంగా పదిహేనురోజులు జరిగేది. కాని వూకదంపుడు: ఆ చర్చలలో ఓ నిర్ణయానికి రావాలని తాయారమ్మ కుండేదికాదు. నారాయణ గదిలో ప్రవేశించేనాటికీ చర్చ ముగిసి ఆరురోజులయింది. అంటే నారాయణ గదిలో పౌర్ణమి ముందు సప్తమినాడు ప్రవేశించాడు.

పూర్ణిమనాడీవివాహచర్చ ప్రారంభం కావడానికి కారణం తాయారమ్మ రసిక హృదయానికి పూర్ణిమాజ్యోత్స్న అశాంతిని కలిగించేది. శివానందంవంటి భర్త లభించినందుకు, తన దురదృష్టాన్ని నిందించుకునేది. “ఎన్నెలనుకమంత ఏటిపాలేనటర” అని శ్రీ నండూరి సుబ్బారావు గారు రాసినట్లుగా పూర్ణిమా చంద్రికలో సుఖ

పడే అదృష్టం తనకు లేకపోవడంవల్ల, తాయారమ్మ తాను విరహంలో క్రుంగిపోయి కాపురం చేస్తూ సుఖపడవలసినకూతు రామెకు జ్ఞప్తికి వచ్చేది. వివాహంలేకుండా దిన మొకతీరుగా యెదుగుతున్న రంగమ్మనుచూచి తల్లి, ఆ చల్లని వెన్నెలరేయిలో కూతురికి తెలియకుండా ఒంటరిగా దుఃఖించేది. రంగమ్మకు సముద్రతరంగం వలె పొంగి పొరలుచున్న వెన్నెలను చూడగానే "తీయని వెన్నెలరేయి" పాట పాడుకోవాలని కోరిక కలిగేది. మన శ్శాంతికోసం ఆ పాట శ్రావ్యంగా పాడేది. కూతు రాపాట పాడడం విని తాయారమ్మ రంగమ్మ మనసు నర్థంచేసుకుని క్రుంగిపోయేది.

నారీ విరోధివలె నారాయణ గదిలోచేరింది మొదలు తలయెత్తి తాయారమ్మని. కాని, అలరువిలుతు పూవుటమ్ముపోలెనున్న రంగమ్మని కాని, ఆ యింట్లోనే అద్దెకున్న ప్లీడరుగుమాస్తా భార్య శారదని కాని చూడక, కాలక్షేపం చేయసాగాడు. అతను గదిలో చేరినమర్నాడు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి రాగానే, తాయారమ్మ కూతురు కమల ఒక పొట్లంతెచ్చి నారాయణ కిచ్చింది. అదేమిటో విప్పి చూడటానికి వ్యవధిలేక, అలమరలో పెట్టి అతను సినిమాకు వెళ్ళి వచ్చేటప్పుడు హోటల్లో భోజనంచేసి గదికి చేరుకోగానే, ఆ పొట్లం గర్తుకువచ్చి, దీపం ముందు పడేశాడు. పొట్లము ముట్టుకోగానే, అతని చేతిని చీమలు కరచాయి. దీపం వెల్తురులో పొట్లంలోని గట్టి పకోడీలకు పట్టిన చీమలు దులుపుతోంటే, శివానందం అప్పుడే భోజనంచేసి, నారాయణని ఒకసారి పరామర్శ చేదామని ఇంట్లోనుంచి బైటికివచ్చాడు. "గదిలో చీమలు లేవండీ! ఏమిటవి పకోడీలాగున్నాయే? కొన్నవి వెంటనే తినేయాలిగాని ఈ రోజుల్లో తరవాత తిందాంలే అని దాచుకుంటే వాసన పడతాయేమో చీమలు సిద్ధమవుతాయి" అన్నాడు.

"ఇవి నేను కొనలేదండీ! నేను సినిమాకు వెళ్తున్నసమయంలో మీ అమ్మాయి తెచ్చి యిచ్చింది" అన్నాడు నారాయణ.

వెంటనే శివానందం "తాయారూ! ఇంట్లో పకోడీలుచేసి నాకు పెట్టలేదేమే? పాపం! నారాయణగారికి నీ వాపేక్షతో పంపించిన పకోడీలన్నీ చీమలు పట్టాయి" అన్నాడు.

"మీ సంపాదనకుతోడు, మీకు చిరుతిళ్లు పెడితే మీరీభూమ్మీద నిలుస్తారూ! కొద్దిగా వండాను అవి అప్పుడే నమిలేశారు పిల్లలు" అన్నది తాయారమ్మ.

"సంపాదన తక్కువ వాడికి పెడితే నూనె పకోడీలయినా నేతి పకోడీలుగా తృప్తిపడి తింటాడు!" అన్నాడు.

"శివానందంగారూ! ఈ పకోడీలు మనిద్దరం తిందాం, రండి?" అని ఆయన్ని నారాయణ గదిలో కాహ్వానించాడు.

"ఆయనకు పెట్టిన పకోడీలు మీరు తినడమేమిటి? అరవై ఏళ్లు నెత్తిమీదికొస్తున్నయి- ఓ మడీ లేదు, ఆచారంలేదు! ఇప్పుడేగా మీరు సుష్టుగా భోంచేసింది!" అన్నది తాయారమ్మ భర్తతో.

ఆ మాటలతో, నూతన వ్యక్తి నారాయణ ఎదుట తనకు మడి, ఆచారం లేదని పకోడీలు తినడం భావ్యంకాదని గ్రహించి, "నాకెందుకండీ! నేనూరికే అన్నాను. నేను బజారులో కావలసిన పిండివంటలన్నీ ఒక్కడిని కొనుక్కుని తింటుంటాను." అన్నాడు శివానందం.

"అలాగా! ఇదెప్పటినుంచీ...?" అన్నది తాయారమ్మ.

శివానందం లోపలికి పోయి, "కొత్తవాడి యెదుట అలాఅనకపోతే, నేను చిరుతిళ్ళకు మొగంవాచి పోయినట్లుగా అతను భావిస్తాడని అన్నాను. నా మొహం! నేను బజారులో చిరుతిళ్ళు తినడం కూడానా? ప్రతినెలా, నలభై అయిదు రూపాయలలో నా పొగాకు చుట్టల కోసం ఓ అయిదు రూపాయలు దగ్గరుంచుకుని, మిగిలిన నలభై నీచేతి కిస్తూనే ఉంటిని." అన్నాడు రహస్యం చెబుతున్నట్లుగా, తాయారమ్మ చెవిమీద తన ముఖమానించి.

త్రపారహితమైన తాయారమ్మ ధూర్తత్వం, శివానందం అమాయిక అస్వతంత్ర జీవిత తత్త్వం నారాయణకు స్థూలంగా బోధపడ్డాయి.

(ముగింపు వచ్చే సంచికలో)